యథేచ్ఛగా రేషన్ దందా!

- ఆత్మకూరు నుంచి బెస్తవారిపేటకు తరలింపు
- రేషన్ డీలర్లే దళారులకు సహకారం
- పట్టించుకోని అధికారులు

పేదలకు అందాల్సిన రేషన్ పక్కదారి పడుతోంది. టీడీపీ నాయకులు కొందరు ఏజెంట్లను నియమించుకుని గ్రామాల నుంచి రేషన్ బియ్యం సేకరించి ఒక చోటుకు చేర్చి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ దందా యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేరు.

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం ఆత్మకూరులో మూడు లారీలు ఆరు టిప్పర్లుగా జోరుగా సాగుతోంది. శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన ఓ ముఖ్య నాయకుడి ఆధ్వర్యంలో ఈ దందా కొనసాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కురుకుంద, వడ్లరామాపురం, ఇందిరేశ్వరం, శ్రీపతిరావుపేట, సిద్ధపల్లి, నల్లకాల్వ, కరివేన గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని లబ్ధిదారుల నుంచి కిలో రేషన్ రూ.8 నుంచి రూ.12 చొప్పున కొనుగోలు చేసి వాటిని రాత్రి, పగలు తేడా లేకుండా ఆటోల ద్వారా ఆత్మకూరుకు చేరవేస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రకాశం జిల్లా బెస్తవారిపేటకు వివిధ వాహనాల్లో తరలిస్తున్నారు.



ఆత్మకూరులో రేషన్ బియ్యాన్ని లారీలోకి ఎక్కిస్తున్న దృశ్యం

ప్రతినెలా 500 నుంచి 600 క్వింటాళ్ల దాకా బియ్యం తరలుతున్నట్లు సమాచారం. అక్కడి ప్రాంతానికి చెందిన ఓ ముఖ్య నాయకుడు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పలుమార్లు ఆత్మకూరు పోలీసులు దాడులు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యాపారులను అదుపులోకి తీసుకున్నప్పటికీ అధికార పార్టీ నాయకుల అండదండలతో సులభంగా బయటకు వచ్చేస్తున్నారనే విమర్శలున్నాయి.

బియ్యానికి బదులు నగదు పంపిణీ

ఆత్మకూరు పట్టణంలో 21 చౌకదుకాణాలు ఉన్నాయి. ఇందులో దాదాపు 7 నుంచి 10 మంది రేషన్ డీలర్లు నిరుపేదలకు బియ్యం పంపిణీ చేయడం లేదు. బియ్యంతోపాటు చక్కెర, జొన్నలు సైతం కార్డుదారులకు పంపిణీ చేయడం లేదని పలువురు వాపోతున్నారు. అర్బన్‌కాలనీ, వెంగళరెడ్డినగర్, కొత్తపేటతో పాటు పలు కాలనీల్లో డీలర్లే లబ్ధిదారులను రేషన్‌షాపుకు పిలిపించుకుని బియ్యానికి బదులు కిలోకు రూ.12 చొప్పున డబ్బు ఇచ్చి పంపుతున్నారనే ఆరోపణలున్నాయి.

ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం

ఆత్మకూరులో కొందరు డీలర్లు రేషన్ బదులు నగదు పంపిణీ చేస్తున్నట్లు మాకు సమాచారం లేదు. నేరుగా బియ్యాన్ని లబ్ధిదారులకే అందించాలి. ప్రతినెలా 80 శాతానికి పైగా నిరుపేదలకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం. బియ్యం ఇవ్వడం లేదని, బియ్యానికి బదులు నగదు ఇస్తున్నారని ఫిర్యాదు చేస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే డీలర్ల లైసెన్సును రద్దు చేస్తాం. రేషన్ అక్రమ తరలింపు విషయం కూడా మాదృష్టికి రాలేదు.
– రత్నరాధిక, ఆత్మకూరు తహసీల్దార్

క్లుప్తంగా

అలరించిన హరికథాగానం



హరికథను వినిపిస్తున్న కళాకారుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై కర్నూలుకు చెందిన పి.రవిప్రసాద్‌రాజు వినిపించిన భక్తమార్కండేయ హరికథాగానం ఆకట్టుకుంది. తబలా సహకారం వెంకటేష్, హార్మోనియం సహకారం పి.జగదీష్ అందించారు.

కూలీకి అస్వస్థత



ఆసుపత్రిలో అవస్థ పడుతున్న బొల్లవరం బాబు

పగిడ్యాల: ఉల్లి పైరుకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తూ కూలీ విషప్రభావంతో అస్వస్థతకు గురయ్యాడు. మండల కేంద్రానికి చెందిన బొల్లవరం బాబు అలియాస్ వెంకటేశ్వర్లు రైతు సుధాకర్‌రెడ్డి పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు కూలీగా వెళ్లాడు. పవర్ స్ప్రేయర్‌తో మందు పిచికారీ చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన రైతు.. అస్వస్థతకు గురైన కూలీని వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నందికొట్కూరు సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ముర్రుపాలతో రోగనిరోధక శక్తి మెండు



తల్లిపాల వారోత్సవాల్లో మహిళలు

ఆత్మకూరురూరల్: తల్లి ముర్రుపాలు బిడ్డకు తాపడం వల్ల రోగనిరోధక శక్తి ఎక్కువగా వస్తుందని అంగన్‌వాడీ వర్కర్ అరుణ తెలిపారు. తల్లిల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొట్టాల చెర్వు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పుట్టిన వెంటనే పాలు పట్టడం వల్ల ప్రసవానంతర రక్తస్రావం తగ్గడమే గాకుండా తల్లీబిడ్డల అనుబంధం పెరుగుతుందన్నారు. బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు శారీరక, మానసిక వికాసం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్



ఆలయ ప్రాంగణాలను పరిశీలిస్తున్న డీసీ గురుప్రసాద్

మహానంది: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మహానందిలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డితో కలిసి ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఏఈఓ మధు, సూపరింటెండెంట్లు నీలకంఠేశ్వరాజు, సుబ్బారెడ్డి ఉన్నారు.

ప్రతిభ ఉంటేనే గుర్తింపు



నటుడు కృష్ణ, మిత్ర బృందం

మహానంది: ప్రతిభ ఉంటేనే చిత్ర పరిశ్రమ గుర్తింపు వస్తుందని సినీ నటుడు వేపూరు కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మహానందీశ్వరుడిని, కామేశ్వరీ దేవిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రసన్నవదనం, సీతమ్మధార పోలీస్‌స్టేషన్, గేమ్‌ఛేంజర్ తదితర చిత్రాల ద్వారా తనకు మంచి గుర్తింపు లభించిందన్నారు.

నీటివనరుల గణన పూర్తి చేయాలి

పాములపాడు: 7వ చిన్న నీటి తరహా వనరుల గణన త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ సుభద్రమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 2వ జలావయాల వనరుల గణన పై శిక్షణా తరగుతులు నిర్వహించారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ ఉప గణాంకాధికారి నాగరాజు ఆధ్వర్యంలో గణన సిబ్బందికి ఇన్‌చార్జ్ ఏఎస్‌ఓ హనుమంతు శిక్షణ ఇచ్చారు. అనంతరం క్షేత్ర స్థాయిలో కొన్ని బావులను, బోర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఖాజాబీ, మిడుతూరు ఏఎస్‌ఓ దేవదాసు పాల్గొన్నారు.

కామేశ్వరీ దేవికి గాజులతో అలంకరణ



గాజుల అలంకరణలో కామేశ్వరీ దేవి

మహానంది: కామేశ్వరీ దేవి అమ్మవారికి శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకుని గాజులతో అలంకారం చేశారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు,అర్చకులు ఉదయం నుంచి విశేషపూజలు జరిపారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార అర్చనలు, కూష్మాండబలి పూజలు చేశారు. పూజలకు హైదరాబాదుకు చెందిన వారణాసి రామ్మోహన్‌రావు,ఏజీఎస్ జ్యూవెలర్స్ అధినేత అవ్వారు గౌరినాథ్ దంపతులతో పాటు పలువురు సహకరించారని వేదపండితుడు రవిశంకర అవధాని తెలిపారు.

మహానందిలో శ్రావణ సందడి

శ్రావణ శుక్రవారం సందర్భంగా మహానందిలో భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



శ్రీవాణి మృతిపై కుటుంబీకులతో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్

పగిడ్యాల: గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్య పరీక్షల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ సుదర్శన్‌బాబు, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారదాబాయి సూచించారు. శుక్రవారం పగిడ్యాల, తూర్పు ప్రాతకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గర్భిణుల నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఇటీవల బీరవోలులో అబార్షన్ చేయించుకున్న శ్రీవాణి.. వైద్యం వికటించి మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులను విచారించి వివరాలు తెలుసుకుని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అబార్షన్ చేసిన ఆర్‌ఎంపీ గీతావాణిపై పోలీసు కేసు నమోదైందని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం గాకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారులు క్రిష్ణమూర్తి, పూజారాణిలను ఆదేశించారు. ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. ఇళ్ల వద్ద ప్రసవాలు చేసుకుంటే తల్లీబిడ్డలకు ప్రమాదమనే విషయాన్ని ఆరోగ్య కార్యకర్తల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రక్తహీనత, బరువు తక్కువ పిల్లల పట్ల కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరచూ ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సూచనలు చేసి శిశుమరణాలను తగ్గించాలన్నారు. అనంతరం శ్రీవాణి మృతిపై కుటుంబీకులతో విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆన్‌లైన్‌వర్క్ భారం తగ్గించాలి



సీడీపీఓ మంగవళికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: అంగన్‌వాడీ వర్కర్లకు ఆన్‌లైన్ వర్క్ భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 5 నుంచి తాము ఆన్‌లైన్ వర్క్ చేయలేమని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు సీడీపీఓ మంగవళికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లకు సపోర్టు చేయడం లేదన్నారు. నెట్ వర్క్, సర్వర్లు పనిచేయక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా తయారు చేయాలని డిమాండ్ చేశారు. సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇచ్చి, 5జీ నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మదార్‌బీ, శివలక్ష్మి, కుర్షిద్‌బీ, హరిత, సాజిదాబీ, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండవగా కామేశ్వరీ దేవి పల్లకీసేవ

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకి సేవ వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర్ అవధాని, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకిలో కొలువుంచారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం కనుల పండువగా సాగింది.

సారూ.. పింఛన్ ఇప్పించండి

పాములపాడు: వితంతు పింఛన్ ఇప్పించి ఆదుకోండి సారూ.. అంటూ మండలకేంద్రానికి చెందిన మొగిలీశ్వరి, కుమారి శుక్రవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు వినతి పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వారు ఎమ్మెల్యేను కలిసి ఆశావర్కర్లుగా విధులు నిర్వహిస్తున్నామనే కారణంతో పింఛన్ నిలిపేశారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

‘ఉపాధి’ జేఈ మృతి

డోన్ టౌన్ : ఉపాధి హామీ పథకం డోన్ మండల జేఈగా విధులు నిర్వహిస్తున్న సంజీవరాయుడు (55) లివర్ సంబంధిత వ్యాధితో శుక్రవారం కర్నూలులోని ఆయన నివాసంలో మృతి చెందారు. ప్యాపిలి మండలంలో దాదాపు నాలుగున్నర సంవత్సరాలు పని చేసిన మృతుడు మూడు నెలల క్రితం డోన్‌కు బదిలీపై వచ్చారు. మృతి గురించి తెలుసుకున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఫక్రుద్దీన్ సాహెబ్, ఏపీఓ షకూర్, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ సాదిక్, టీఏలు, ఫీల్డ్ అసిసెంట్లు కర్నూలుకు వెళ్లి మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలగ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ఫిర్యాదు చేయండి

ఆత్మకూరు: ఇంటి యజమాని అనుమతి లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు స్మార్ట్‌మీటర్లను బిగించేందుకు ప్రయత్నిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీపీఎం, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు యేసురత్నం, సుధాకర్ సూచించారు. వడ్లరామాపురం రస్తా, ఏబీఎం, ఎస్సీబీసీపాలెం, గొల్లపేట, వడ్లపేట, కొత్తపేట, కల్లావీధిలో స్మార్ట్‌మీటర్ల బిగింపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు రణధీర్, రజాక్, సుధాకర్, రామ్‌నాయక్, ప్రతాప్, వెంకటేశ్వర్లు, పరమేష్, దర్గయ్య, నాగేష్, సురేష్, జబీవుల్లా పాల్గొన్నారు.

లిక్కర్ బాటిళ్లు స్వాధీనం

బండిఆత్మకూరు: మండల పరిధిలోని సింగవరం గ్రామానికి చెందిన మధు నాయుడు నుంచి లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. మధునాయుడు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడనే సమాచారంతో వెళ్లి సోదాలు చేయగా 11 లిక్కర్ బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

వైద్య సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి, ఎర్రమఠం, సిద్ధేశ్వరం, బలపాలతిప్ప, జనాలగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శుక్రవారం పర్యటించారు. ఎర్రమఠం ఆస్పత్రి వైద్య సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నేమ్‌బోర్డులో గతంలో పని చేసిన డాక్టర్ల పేర్లే ఉండటం, వైద్యశాలలో భవన నిర్మాణ సామాగ్రి ఉండటంతో అక్కడి వారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వహించని సిబ్బందిని తొలగించి పనిచేసేవారిని నియమించాలని జిల్లా వైద్యాధికారిని ఫోన్లో కోరారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో సీఎం చంద్రబాబు నాయుడు ఘోరంగా విఫలమయ్యారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక వైష్ణవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ.10 వేల కోట్లు కేటాయిస్తే పూర్తి చేయడానికి కృషి చేయకుండా గోదావరికి బనకచర్లకు అనుసంధానం చేసేందుకు రూ.81 వేల కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, గుండ్రేవుల, సిద్ధేశ్వరం అలుగు నిర్మాణ ప్రాజెక్టులకు రూ.100 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు ఖర్చు పెడితే రాయలసీమ జిల్లాల ప్రజలకు, రైతులకు సాగు నీరు, తాగునీరు పుష్కలంగా అందించవచ్చన్నారు.రాయలసీమ ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, గోపాలకృష్ణ, ఫక్కీర్‌సాహెబ్, కర్ణ, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రంగమ్మ, ఓబులేసు, ఈశ్వరమ్మ, లింగస్వామి, మద్దమ్మ, శ్రీను, జయరాణి, రాము, తిక్కస్వామి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, ఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ నాయకులు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ విద్యావైజ్ఞానిక శిక్షణా తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలను, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. తల్లికి వందనం పథకం కింద అనేక షరతులు పెట్టి విద్యార్థులను, విద్యార్థి తల్లిదండ్రులను మోసగించిందన్నారు. అనంతరం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై తొలిరోజు నాయకులు గోపాల్, నాయక్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్, హర్షవర్ధన్, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారమే ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న సయ్యద్‌చాంద్‌బాషా

ఆత్మకూరు: సీనియారిటీ ఆధారంగా ఎంఈఓ-1 పోస్టులను భర్తీ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌చాంద్‌బాషా డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓ పోస్టులను కామన్ సీనియారిటీ ప్రకారం కాకుండా కేవలం ఉపాధ్యాయులతో భర్తీ చేయడం తగదన్నారు. ప్రభుత్వం మేనేజ్‌మెంట్ పరిధిలోని ప్రధాన ఉపాధ్యాయులు వారు దొరకనిపక్షంలో అదే యాజమాన్యం పరిధిలోని స్కూల్ అసిస్టెంట్లలో ఎంఈఓ పోస్టులను భర్తీ చేయడం సమంజసం కాదని, దీనిని పీఆర్‌టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పీఆర్‌టీయూ నాయకులు సయ్యద్‌ఇబ్రహీం, ఎస్వీ రామిరెడ్డి, దామరేకల రవి, నూర్‌మహమ్మద్, ఉసేన్‌సాహెబ్, ప్రవీణ్‌కుమార్, హనుమంతు, కరిముల్లా, శ్రీనివాసులు, మోహన్‌బాబు, మహేష్, హరినాథ్‌బాబు, శివుడు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: ఉమ్మడి సీనియార్టీ ఆధారంగా ఎంఈఓ 1 పోస్టులు భర్తీ చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు

నందికొట్కూరు: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బందితో కలిసి శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు సీడీపీఓ మంగవళి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు బిడ్డ హక్కు...తొలి టీకా జీవితానికి కవచం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలకు మద్దతునిచ్చే స్థిరమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు. బిడ్డ ఆరోగ్య భవితకు బలమైన పునాది తల్లిపాలు ఇవ్వడమేనన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ పాల్గొన్నారు.

కుందూనదిలో ఆటోడ్రైవర్ గల్లంతు?

బండిఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ముర్తుజావలి హుసేన్ శుక్రవారం కుందూనదిలో గల్లంతైనట్లు సమాచారం. కుటుంబ సభ్యులు అతని కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రం సమీపంలో సుమారు 30వేల క్యూసెక్కుల నీటితో కుందూనది ప్రవహిస్తోంది. ఈక్రమంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆటో డ్రైవర్ ముర్తుజావలి హుసేన్ తన ఆటోను శుభ్రం చేసుకునేందుకని నది వద్దకు వెళ్లాడు. రాత్రి తొమ్మిది గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నది వద్దకు వెళ్లి చూడగా ఆటోలో దుస్తులు, సెల్‌ఫోన్ ఉన్నాయి. ప్రమాదవశాత్తూ నదిలో గల్లంతై ఉంటాడనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

బండి ఆత్మకూరు: మండలంలోని విష్ణు నందీశ్వర స్వామి దేవస్థాన ధర్మకర్త నియామకానికి శుక్రవారం ఉన్నతాధికారుల సమక్షంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించినట్లు ఆలయ ఈఓ వేణునాథరెడ్డి తెలిపారు. విష్ణు నందీశ్వర స్వామి దేవస్థానానికి వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్తగా తమనే నియమించాలని బి.కోడూరు గ్రామానికి చెందిన చిట్టిబొట్ల భరద్వాజ శర్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో.. కోర్టు ఆదేశం మేరకు దేవదాయ శాఖ ఉప కమిషనర్ గురు ప్రసాద్ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ, లిఖితపూర్వక సమాధానాలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుమల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ హరిచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘అబార్షన్ వికటించి మహిళ మృతి’పై విచారణ

- ‘గర్భంలోనే సమాధి’ కథనానికి స్పందించిన పోలీసు అధికారులు
- క్లినిక్‌ను తనిఖీ చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న రూరల్ సీఐ



ఆర్‌ఎంపీ గీతారాణి క్లినిక్ వద్ద విచారణ చేస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం, మిడుతూరు ఎస్‌ఐ ఓబులేసు

నందికొట్కూరు: ‘గర్భంలోనే సమాధి’ శీర్షికకు సాక్షి ప్రచురించిన కథనానికి పోలీసు అధికారులు స్పందించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం శుక్రవారం విచారణ చేపట్టారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఎదురుగా ఉన్న క్లినిక్‌ను తనిఖీ చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా విచారణ కోసమని ఫోన్ చేసినా ఆర్‌ఎంపీ గీతారాణి స్పందించడం లేదని, స్విచ్ఛాఫ్ వస్తుందని సీఐ తెలిపారు. తాళాలు పగలకొట్టి క్లినిక్‌ను తనిఖీ చేశామన్నారు. విచారణలో కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామన్నారు. త్వరలోనే విచారణ పూర్తి చేసి వాస్తవాలను వెల్లడిస్తామన్నారు. ఆయన వెంట మిడుతూరు ఎస్‌ఐ ఓబులేసు ఉన్నారు. కాగా కర్నూలు పాత బస్టాండ్‌లోని ఓ స్కానింగ్ సెంటర్‌లో గర్భిణి శ్రీవాణికి ఆర్‌ఎంపీ గీతారాణి లింగ నిర్ధారణ పరీక్షలు చేయించినట్లు సమాచారం.

పింఛన్ల పంపిణీ

జూపాడుబంగ్లా: ఆగస్టు పింఛన్లను శుక్రవారం అధికారులు పంపిణీ చేశారు. మండలానికి 4,951 పింఛన్లకు గానూ మొదటి రోజు 4,656 (94.04 శాతం) పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. మిగతా వారికి శనివారం సాయంత్రం లోపు పంపిణీ చేస్తామన్నారు.

– **పాములపాడు:** మండలంలో మొదటి రోజు 92.88శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. కొత్తగా మంజూరైన 103 స్పౌజ్ పింఛన్లను కూడా పంపిణీ చేశామన్నారు.



తరిగోపుల సమీపంలో వరిమడిలో విత్తనాలు చల్లుతున్న రైతు



విత్తనాలు చల్లిన నారుమడి

వరి సాగుకు సన్నద్ధం

జూపాడుబంగ్లా: కర్నూలు-కడప కాల్వ ఆయకట్టు రైతులు ముమ్మరంగా వరిపంటసాగుకు సన్నద్ధమవుతున్నారు. మండలంలో కేసీ పరివాహక గ్రామాలైన భాస్కరాపురం, తాటిపాడు, 80బన్నూరు, పోతులపాడు, తరిగోపుల, తూడిచెర్ల గ్రామాల్లోని రైతులు వరిపంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. పంట సాగుకు అవసరమైన నారుమళ్లను సాగుచేసుకోవటంలో రైతులు బిజీగా ఉన్నారు. మొలకొచ్చిన వడ్లను నారుమడుల్లో చల్లుకుంటున్నారు. మరో ఇరవై రోజుల అనంతరం పొలాల్లో వరినాట్లు వేసుకోనున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని భాస్కరాపురం, తాటిపాడు, 80బన్నూరు, పోతులపాడు, తరిగోపుల, తూడిచెర్ల ఆయా గ్రామాల్లో 2,500 ఎకరాల్లో వరిపంటను సాగుచేసే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.



మడిలో మొలకెత్తిన వరినారు